క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం



విజ్ఞప్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె తన గృహంలో ప్రజల నుంచి విజ్ఞాపులు స్వీకరించారు. ప్రతీ శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి ఆయా శాఖల అధికారులకు పంపి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, జితేందర్ రెడ్డి, ప్రసాద్, జీవన్‌రెడ్డి, పాషా, ఎల్లం, షేక్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

యువత వ్యాపారంలో రాణించాలి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రోహిత్‌కు వినతిపత్రం అందిస్తున్న రామ్‌చంద్రం

చిన్నశంకరంపేట(మెదక్): యువత వ్యాపారంలో రాణించాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సూరారం గ్రామానికి చెందిన యాదగిరి ఏర్పాటు చేసిన టెంట్‌హౌస్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కొర్విపల్లిలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని గ్రామ కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రామ్‌చంద్రం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణ, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మనోజ్, కాంగ్రెస్ నాయకులు రాజ్‌కుమార్, మోహన్‌నాయక్, రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



కొత్తపేటలో వైద్య శిబిరం

పెద్ద శంకరంపేట(మెదక్): గ్రామీణ ప్రాంతాల ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్గి ఉండాలని పల్లె దవాఖాన వైద్యాధికారి సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేటలో నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది యాదయ్య, వెంకటేశం, సాయిలు, వెంకటమ్మబాయి, ఏఎన్‌ఎం ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి: ఏఓ



ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏఓ

కౌడిపల్లి(నర్సాపూర్): ఎరువుల షాపు డీలర్లు ఎమ్మార్పీ ధరలకే యూరియా, ఇతర ఎరువులు అమ్మాలని ఏఓ స్వప్న అన్నారు. శుక్రవారం కౌడిపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో స్టాక్, స్టాక్ బోర్డు, ధరల పట్టిక, బిల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎరువులు కచ్చితంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు అమ్మితే శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు డీలర్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు దివ్యశ్రీ, రాజశేఖర్‌గౌడ్, ఆత్మ బీటీఎం గౌతమి, డీలర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నాణ్యతలేని పనులా?

డీపీఓ ఆగ్రహం

- వంద శాతం పనులు చేస్తేనే.. బిల్లులు
- నాణ్యత లేని పనులు మళ్లీ చేయించాలని పీఆర్ ఏఈకి ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్



నీలకంఠపల్లి పాఠశాలలో బండలు పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

అల్లాదుర్గం(మెదక్): పాత పనులకు కొత్త హంగులు అనే శీర్షికతో గురువారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీంతో ఈ వార్తకు కలెక్టర్ స్పందించారు. పాఠశాలల్లో విచారణ చేయాలని డీపీఓ యాదయ్యను ఆదేశించారు. అల్లాదుర్గం మండలంలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) యాదయ్య విచారణ చేపట్టారు. మండల పరిధిలోని ముస్లాపూర్ తండా, నడిమితండా, అప్పాజీపల్లి, నీలకంఠిపల్లి, అప్పాజీపల్లితండా పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నీలకంఠపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ.. పనులు సక్రమంగా చేయలేదని, ఇష్టం వచ్చినట్లు పనులు చేసి నిధులు స్వాహా చేశారని చెప్పారు. డీపీఓ మాట్లాడుతూ.. పాఠశాల తరగతి గదిలో బండలు అధ్వానంగా వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బండలు పూర్తిగా తీసి, మళ్లీ వేయించాలని పీఆర్ ఏఈ విజయ్‌గౌడ్‌ను ఆదేశించారు. నాణ్యతతో వంద శాతం పనులు చేస్తేనే రికార్డులు చేసి బిల్లులు ఇవ్వాలన్నారు. సక్రమంగా పనులు చేయకుంటే బిల్లులు నిలిపివేయాలన్నారు. పనులు వెంటనే పూర్తి హెచ్చరించారు. ఇప్పటికే 50 శాతం నిధులు డ్రా చేసుకొని నాణ్యత లేకుండా పనులు చేసినట్లు స్థానికులు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ధనుంజయ్య, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



పూజలు చేస్తున్న జిల్లా నోడల్ అధికారి

రామాయంపేట(మెదక్): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సరస్వతి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కళాశాలలో దాతల సహకారంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర కళాశాలలు రామాయంపేట కళాశాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంతకుముందు హోమం చేశారు. రామాయంపేట, చేగుంట జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు హిమజ్యోతి, కృష్ణారెడ్డి, విగ్రహదాత నాగభూషణచారి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గుంతలతో ఇబ్బందులు



నర్సాపూర్ చౌరస్తాలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

నర్సాపూర్: జాతీయ రహదారిపై పట్టణంలోని చౌరస్తాలో ఏర్పడిన గుంతలతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు ఏర్పడి చాలా రోజులు కావస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు వాటిని పూడ్చేందుకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. చౌరస్తాలో గుంతలు ఏర్పడడంతో వాహనాలు ముందుకు వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చినా.. వాహనాలను సరైన సమయంలో ముందుకు నడుపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చౌరస్తాలో ఏర్పడిన గుంతలు పూడ్చడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు తొలగించాలని వారు కోరుతున్నారు.

సంరక్షణ అందరి బాధ్యత

డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు



అవంచలో మొక్క నాటుతున్న అధికారులు

నర్సాపూర్ రూరల్: నాటిన మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం అవంచలో నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. విరివిగా మొక్కలు నాటి, అవంచ గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలని తెలిపారు. మహిళలు ప్రతిరోజు తడి, పొడి చెత్తను వేరుగా చేసి చెత్తబండిలో వేయడం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధులత, ఎంపీఓ వైద్య శ్రీనివాస్, ఏపీఓ అంజిరెడ్డి, ఏపీఎం గౌరీ శంకర్, కార్యదర్శి మల్లేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెద్దచింతకుంటలోని నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ దామోదర్, రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర నాయకుడు మోహన్ రెడ్డి, మొక్కలు నాటారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



కౌడిపల్లిలో తొట్టిలోని నీటిని పారబోస్తున్న సూపర్‌వైజర్ ఖమర్ సుల్తాన



శివ్వంపేట(నర్సాపూర్): తాళ్లపల్లితండాలో టైరులోని నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల పరిసరాల వద్ద నిల్వ ఉన్న నీటిని పారబోయించారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కౌడిపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖమర్ సుల్తాన, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది గ్రామంలో తిరిగి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్కువ రోజులు నిల్వ ఉన్న తొట్టిలోని నీటిని పారబోసి శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజియ సుల్తాన, సుమిత్ర, ఆయా చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరిపంట పరిశీలన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గౌతాపూర్, ఫైజాబాద్ గ్రామాల్లో వరి సాగును శుక్రవారం మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరినాటు వేసేటప్పుడు భాస్వరం పూర్తి మోతాదు, పోటాష్, ఎరువు సగం మోతాదులో వేసుకోవాలన్నారు. నత్రజనిని మూడు దశల్లో వేసుకోవాలన్నారు. 3వ దశ సమయంలో పోటాష్ ఎరువును సగం మోతాదులో కలిపి వేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా వరిలో కాండం తొలుచు పురుగు రాకుండా ముందుజాగ్రత్తగా కార్టప్ హైడ్రాక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరాకు 8 కిలోలు చల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భూపాల్, రైతులు పాల్గొన్నారు.

సెట్విన్ చైర్మన్‌గా గిరిధర్‌రెడ్డి



గిరిధర్‌రెడ్డికి శుభాకాంక్షలు

నర్సాపూర్: సెట్విన్(సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ అండ్ ట్రెనింగ్ ఇన్ ట్విన్ సిటీస్) కార్పొరేషన్ చైర్మన్‌గా గిరిధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. దీంతో పీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి ఆయన్ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యువజన కాంగ్రెస్ నాయకులు వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు చక్రవర్తి, గోవింద్, హజ్జు, రాకేశ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల పంచాయతీ పరిధిలోని లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్ బదిలీ అయ్యారు. 14ఏళ్లుగా ఇక్కడ విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడిని గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఎల్‌ఈడీ టీవీ బహూకరించగా.. తిరిగి పాఠశాల విద్యార్థులకు ఇచ్చారు. దీంతో పాటు పాఠశాల విద్యార్థులకు స్టీల్‌వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీతశ్రీ, మల్లేశం, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగుల పంచమి



నిజాంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాగుల పంచమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్రుడి విగ్రహానికి, పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.



టేక్మాల్‌లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



చేగుంట నాగులమ్మ ఆలయం వద్ద..



చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో..



కౌడిపలిలో..



వెల్దుర్తి: బంగారమ్మ ఆలయం వద్ద ..

మొక్కలు నాటుదాం.. ప్రకృతిని కాపాడుదాం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డి



బాలికల పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): పచ్చని మొక్కలు నాటి ప్రకృతి కాపాడుదామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను ప్రతీ విద్యార్థి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి రాధాకిషన్, తహసీల్దార్ గఫూర్ మియా, ఎంపీడీఓ కృష్ణవేణి, ఏపీఓ మహిపాల్ రెడ్డి, ఆర్‌ఐ ప్రభాకర్, ప్రిన్సిపాల్ సత్య కుమారి, మంజుల, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా, యువత విభాగం అధ్యక్షుడు సంతోష్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు



నర్సాపూర్: మొక్కలు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు, అధికారులు



రామాయంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అటవీశాఖ అధికారులు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం స్వచ్ఛదనం - పచ్చదనంలో భాగంగా ఆయా గ్రామాల్లో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు పల్లెల్లోని పాఠశాలల్లో మొక్కలు నాటారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. నాటిన మొక్కలను కాపాడాలని పిలుపునిచ్చారు.



పెద్దశంకరంపేటలో మొక్కలు నాటుతున్న అధికారులు

సంక్షిప్త వార్తలు

◆ మోటార్ వైర్ల చోరీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): వ్యవసాయ బోరుమోటార్ల కేబుల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేస్తున్నారు. శుక్రవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చండూర్ గ్రామ శివారులోని మంజీరవాగులో నుంచి పలువురు గ్రామ రైతులు తమ వ్యవసాయసాగు కోసం లైన్ తీసుకున్నారు. పలువురి రైతుల మోటార్ల కేబుల్స్ దొంగతనానికి గురయ్యాయి. ఈ విషయమై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. రైతులు శంకర్‌రెడ్డి, నాందేవ్, యాదగిరి, శ్రీకాంత్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

◆ సన్మానం

నర్సాపూర్: ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాల కాలేజీ ప్రిన్సిపాల్ బలరంనాయక్‌ను గిరిజన సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శివాజీనాయక్, ఇతర ప్రతినిధులు మహేందర్ నాయక్, చత్రు నాయక్, గణేశ్, శ్రీకాంత్ కిరణ్, భాస్కర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. శుక్రవారం కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రామాయపల్లిలో జీఎమ్మార్ వరలక్ష్మి ఆధ్వర్యంలో సీఎంఆర్ ఆస్పత్రి సౌజన్యంతో వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, పీహెచ్‌ఎన్ కాంత, వైద్యులు సుధాకర్, హెచ్‌ఏఎం రాజేందర్‌రెడ్డి, ఎన్‌ఏఎంలు వరలక్ష్మి, స్వర్ణలత, ఆశ సుజాత, కార్యదర్శులు రాజు, స్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

◆ కేంద్ర బడ్జెట్‌లో కార్మికులకు అన్యాయం

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కార్మికులు, రైతులకు అన్యాయం జరుగుతుందని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ తెలిపారు. శుక్రవారం కౌడిపల్లిలో కార్మికులతో కలిసి ప్లేకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయం చేసేవరకు పోరాటం చేస్తామని చెప్పారు.

◆ సేంద్రియ కూరగాయల సాగు

చిలప్‌చెడ్(నర్సాపూర్): కాకతీయ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసిన ఓ యువకుడు ఉద్యోగాలకు ఆకర్షితులైనప్పటికీ వ్యవసాయమే లక్ష్యంగా తనకున్న 20 గుంటల పొలంలో సేంద్రియంగా కూరగాయాలను పండిస్తున్నాడు. శుక్రవారం ఆ కూరగాయాల సాగును మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి పరిశీలించారు. చిలప్‌చెడ్‌కు చెందినన్యాత శ్రీనివాస్ సేంద్రియంగా కూరగాయాలు పండిస్తున్నాడు. ప్రతీ రైతు తనకున్న పొలంలో కొంతవరకైన ఈ ప్రకృతా వ్యవసాయం చేయాలని సూచించారు.

◆ వ్యక్తికి తీవ్ర గాయాలు

చేగుంట(తూప్రాన్): పొలంగట్టు వద్ద పంచాయితీతో ఓవ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉల్లితిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన ఆత్కూరి సుధాకర్, మల్లేశ్ పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం పొలంవద్ద ఇద్దరికి గొడవ జరిగి దాడులకు పాల్పడ్డారు. ఈ గొడవకు సంబంధించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

◆ ఆశ్రమ పాఠశాలలో ఆదివాసి దినోత్సవం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాల, ఎస్టీ హాస్టల్‌లో శుక్రవారం హెచ్‌డబ్ల్యూఓ (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్) జయరాజ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజ్ ఆదివాసి సాంప్రదాయాలు, సంస్కృతిని విద్యార్థులకు తెలియచేశారు. అనంతరం విద్యార్థులు పలు విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గయ్య, సత్యాగౌడ్, నరేందర్, రాజేశ్వరీ, మంజుల, వినోద, పీఈటీ పానీల్, ఏఎన్‌ఎం వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

